బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులు

- ప్రజాపాలన కాదు.. రాక్షస పాలన..!
- బీఆర్ఎస్ మాజీ సర్పంచులు

కొత్తకోట, మార్చి 19 : బీఆర్ఎస్ హయాంలో పలు అభివృద్ధి పనులకు మంజూరు చేసిన బిల్లులను పెండింగ్‌లో పెట్టడం సరికాదని, వెంటనే ఆ బిల్లులను విడుదల చేయాలని బీఆర్ఎస్ మాజీసర్పంచుల సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బీఆర్ఎస్ సర్పంచులు పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని హైదరాబాద్‌కు వెళ్తుండగా వారిని అడ్డుకొని, అక్రమఅరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం సబబుకాదన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావొస్తున్న పెండింగ్‌లో ఉన్న బిల్లులను అడిగినా ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రజా అభివృద్ధి సమస్యలపై నిత్యం బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో పోరాటం చేస్తుందని, అభివృద్ధిలో బీఆర్ఎస్ హయాంలో ఎంతో మెరుగుపడిందన్నారు. కాంగ్రెస్ పాలన ఏడాదిన్నర గడుస్తున్న, బీఆర్ఎస్ హయాంలో ఉన్న విడుదలైన నిధులు ఇవ్వకపోగా, వాటిపై బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేయడం చేతకాని తనమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని సమస్యలను గాలికి వదిలేసి ముఖ్యమంత్రి, మంత్రులు ఊరేగుతున్నారని ఆయన అన్నారు. సర్పంచుల కుటుంబాలు రోడ్డున పడేవరకు ప్రభుత్వం స్పందించదా..? శాంతియుత నిరసనకు పిలుపునిచ్చిన సర్పంచులను ఎందుకు అరెస్టు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. పల్లెప్రగతి పేరిట మేము చేపట్టిన కార్యక్రమానికి తూట్లు పొడిచి నిధులు విడుదల చేయకుండా ఆపుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అదేవిధంగా స్థానిక ఎన్నికలు జరగనందున ప్రతి ఊరిలో స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతూ ఉండడం వలన గ్రామాల్లోని పారిశుధ్య, తాగునీరు, వాటర్‌ట్యాంకర్ల పరిస్థితి ఆగమ్య గోచరంగా మారిందని, వాటిని పట్టించుకోక పోవడం వలన ప్రజలు పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. అందుకు తక్షణమే గ్రామ పంచాయతీ, స్థానికఎన్నికలు జరపాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు లక్ష్మీకాంత్‌రెడి, నగేశ్, పరమేశ్, శంకర్, లక్ష్మణ్‌నాయక్, బుచ్చన్న, రమణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేసిన పోలీస్ శాఖ

వీరనాగు శతకం.. సామాజిక శతకం

బుద్ధారంలో వీరనాగు పుస్తకావిష్కరణలో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట, మార్చి 19: వీరనాగు శతకం సామాజిక శతకంగా చరిత్రలో నిలిచిపోనుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బుద్ధారంలో దామోదర్‌రెడ్డి మెమోరియల్ స్కూల్ వరణలో బుధవారం నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నెలపొడుపు అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య అధ్యక్షతన వీరనాగు శతకం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. పుస్తకాన్ని గ్రామానికి చెందిన (సి.టీ కళాశాల విద్యార్థి) చిక్కొండ్ర రవి రచించగా, రచయిత అమ్మమ్మ మదిరె మల్లమ్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. మాజీ మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. పుస్తక రచయిత రవి చిన్నవయసులో గ్రామీణ ప్రజల జీవన విధానం, సామాజిక అసమానతలు, ప్రజల స్థితిగతులు, జీవకోటికి ప్రణాధారమైన నీళ్లను సాహిత్యంగా తీసుకొని వీరనాగు శతకం రచించడం అభినందనీయమన్నారు. ఒకనాడు వర్షం పైనే ఆధారపడే వ్యవసాయాన్ని చూసి చలించిన నేను అపర భగీరథ ప్రయత్నంతో కృష్ణా జలాలను తీసుకొచ్చిన వైనాన్ని రవి వివరించారని కొనియాడారు. అనంతరం రచయిత తల్లిదండ్రులు శ్రీశైలం, నాగమ్మ, తాత, నాయనమ్మ తిక్కన్న అంజనమ్మను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కవి సంధ్య సంపాదకుడు శిఖామణి, ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ కోయి కోటేశ్వరరావు, తెలంగాణ వికాస సమితి వనపర్తి డాక్టర్ వీరయ్య, కవి బాల్‌రాం, రామ్మూర్తి, అమర్‌నాథ్, తెలంగాణ సాహితి కార్యదర్శి వహీద్‌ఖాన్, రచయిత విప్లవ్, తెలంగాణ సాహితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్

- గద్వాల కలెక్టర్ సంతోష్

మద్దికల్, మార్చి 19 : ఉపాధిహామీ పనులను ప్రతిగ్రామంలో ప్రతి కూలీకి పనులు కల్పించాలని లేకుంటే అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ సంతోష్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని తాటికుంట, పెద్దొడ్డి గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేస్తున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. అలాగే కూలీపనులు చేస్తున్న దగ్గరికి వెళ్లి కూలీలతో ప్రత్యేకంగా మాట్లాడారు. పనులు చేస్తున్న దగ్గర కూలీలకు సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో ఉపాధి అధికారులపై ఆగ్రహంవ్యక్తం చేశారు. ఎండకు పనిచేసి వస్తే వారికి నీడలేదని వారికి కనీసం షెడ్డు వేయాలని ఆదేశించారు. ఆనంతరం గ్రామాల్లో నర్సరీల పెంచుతున్న స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో రాజశేఖర్, ఏపీ వో సుజాత పాల్గొన్నారు.

నేషనల్‌గేమ్స్‌కు ఎంపికైన జిల్లా ఉపాధ్యాయులు

నేషనల్ పోటీలకు ఎంపికైన ఉపాధ్యాయులు

గద్వాల టౌన్, మార్చి 19 : ఉద్యోగులకు సివిల్ సర్వీసెస్ గేమ్స్ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించే పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ధర్మవరం హై స్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్ గౌరీ, వేముల జెడ్పీహెచ్ఎస్ పీడీ దేవేందర్, మద్దెలబండ జెడ్పీహెచ్ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌జీటీ యశోధలు ఎంపికయ్యారు. వీరు గతనెలలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికయ్యారని డీవైఎస్‌వో జితేందర్ తెలిపారు. జాతీయ జిల్లానుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. జాతీయ స్థాయిలో కూడా ఉపాధ్యాయులు రాణించి జిల్లా పేరును నిలబెట్టాలని ఆకాక్షించారు.

పట్టుదలగా చదివితే లక్ష్యాలను సాధించొచ్చు

మాట్లాడుతున్న సీఐ టాటా బాబు

వడ్డేపల్లి, మార్చి 19 : విద్యార్థులు పట్టుదలగా చదివితే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని సీఐ టాటాబాబు అన్నారు. శాంతినగర్‌లోజెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సై నాగశేఖర్‌రెడ్డి, ఎంఈవో నర్సింహులు మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపు ప్రదేశాల గుర్తింపు

జేసీబీతో ధ్వంసం చేస్తున్న అధికారులు

గోపాల్‌పేట, మార్చి 19: ఇసుక రవాణాపై వార్తా పత్రికల్లో వచ్చిన కథనాలతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పందించిన అధికారులు బుధవారం మండలంలోని చెన్నూరు వాగు వద్ద ఇసుక తరలింపు ప్రదేశాలను గుర్తించారు. ఎమ్మార్వో తిలక్ కుమార్‌రెడ్డి, ఎస్సై నరేశ్‌కుమార్ తమ సిబ్బందితో కలిసి వాగు వద్ద 3 ఇసుక ఫిల్టర్స్, 70 నుంచి 80 ట్రాక్టర్ల ఫిల్టర్ చేసేందుకు ఉంచిన (మట్టితో కూడిన) ఇసుకను గుర్తించారు. మండల కేంద్రానికి చెందిన పుల్లయ్యయాదవ్, బాలరాజు, సురేందర్ ఇసుక ప్రదేశాలను జేసీబీతో ధ్వంసం చేసినట్లు వారు తెలిపారు. అక్కడ లభించిన ఫిల్టర్ సామగ్రిని తాసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. ఇసుక నాణ్యతపై తనిఖీ కోసం సంబంధిత ఏడీకి నివేదిక పంపినట్లు వారు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్గో ద్వారా భద్రాచల రాముడి తలంబ్రాలు

వనపర్తి టౌన్, మార్చి 19 : శ్రీరామ నవమిని పురస్కరించుకొని భద్రాచలం వెళ్లలేకపోతున్న భక్తులకు శ్రీరాముని కల్యాణోత్సవ తలంబ్రాలను ఆర్టీసీకార్గో సర్వీసు ద్వారా నేరుగా ఇంటికే అందజేయ్యనున్నట్లు డీఎం వేణుగోపాల్ చెప్పారు. తలంబ్రాలకు రూ.151 చెల్లించాలన్నారు. వనపర్తి 9866344200, పెబ్బేరు 8801828143, కొత్తకోట 8886848518, ఆత్మకూరు 7382829494 బస్ స్టేషన్‌లో కార్గో కౌంటర్‌లో సౌకర్యం ఉందని చెప్పారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

దొంగలు అరెస్టు రిమాండ్

- 5తులాల బంగారం, రూ.31లక్షల నగదు స్వాధీనం

వనపర్తి టౌన్ , మార్చి 19 : పగటి పూట దొంగలను పట్టుకొని వారి నుంచి 5 తులాల బంగారం, రూ.3లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ రావుల గిరిదర్ వెల్లడించారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. తాగుడుకు , జల్సాలు, కోడి పందేలు ఆడేందుకు, ఇతర వ్యవసనాలకు అలవాటుపడి త్వరగా ఎలాంటి కష్టం చేయకుండా డబ్బులు సంపాదించాలని ఆలోచనతో పట్టపగలు దొంగతనాలు చేస్తు హాల్‌చల్ సృష్టిస్తున్న దొంగలను పట్టుకున్నామన్నారు. తప్పుడు దారిలో గొర్రెల దొంగతనం చేసి పాన్‌గల్ పోలీసు స్టేషన్‌లో పట్టుబడి జైలుకెళ్లిన ఘటనలో నిందితులని, జైలు కెళ్లిన సమయంలోనే మరో దొంగ మూర్తితో పరిచయం ఏర్పాటు చేసుకొని పట్ట పగలు తాళం వేసిన ఇళ్లపై రెక్కి నిర్వహించి ఇంటి తాళాలు, బీరువా తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారు, వెండి వస్తువులు దొంగలించడం అలవాటుగా మార్చుకున్నారన్నారు. నేరస్తులు వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్యాటగడ్డకు చెందిన ముత్తు, గాంధీనగర్‌కు చెందిన రాజు , బోలమోని అంజిలు వీరు మేస్త్రీ , డ్రైవరు వృత్తులు చేస్తుంటారని, మొత్తం 16 కేసులలో దొంగతనాలు చేసి 8 దొంగతనాలు నాగర్‌కర్నూల్ జిల్లాలోని వివిద మండలాల్లో పాల్పడి బంగారు, వెండి ఆభరణాలు దోచుకున్నారన్నారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నారని ఎస్పీ తెలిపారు. నేరస్తులను పట్టుకోవడంలో కృషి చేసిన సీసీఎస్ సీఐ రవిపాల్, సిఐ కృష్ణ, ఎస్సై హరిప్రసాద్, రూరల్ ఎస్సై జలంధర్‌రెడ్డి, ఎస్సైలు జగన్, రాణి, జయన్న, రామరాజు, తిరుపతిరెడ్డి, కానీస్టేబుల్స్ మురళీ, గోవిందు, సమరసింహారెడ్డి, అభిషేక్, రాజమోహన్, నవీన్‌గౌడ్,గోపాల్, అరవింద్‌లను ఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

వడ్డేపల్లి, మార్చి 19 : మండలంలోని రామాపురానికి చెందిన సుభాష్, గోకులపాడుకు చెందిన శివయ్యలు తమ ద్విచక్ర వాహనంలో అయిజకు పరీక్ష రాయడానికి వెళ్తుండగా జూలేకల్ స్టేజీ సమీపంలోని వాగువద్ద ఎదురుగా వస్తున్న బులోరా వాహనం ఢీ కొనడంతో విద్యార్థులు కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో కర్నూలు దవఖానాకు తరలించారు. ప్రమాదానికి కారణమైన బులేరో వాహనాన్ని స్టేషన్‌కు తరలించామని ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వడ్డేపల్లి, మార్చి 19 : మున్సిపాలిటీ కేంద్రమైన శాంతి నగర్‌లోని పదోవార్డులో చోరీ ఘటన చోటు చేసుకున్నది. కాలనీవాసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.. వెంకట్రాముడు గత నాలుగు రోజులుగా దవఖాన పని నిమిత్తం కర్నూలుకు వెళ్లారు. తాళంవేసిన ఇంటిని గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.5 లక్షల నగదును, బంగారాన్ని ఎత్తుకెళ్లారు. బాధిత అల్లుడు వేరే ప్రాంతంలో సీఐగా పనిచేస్తున్నాడని, ఆయన సూచనల మేరకు గురువారం పూర్తి వివరాలతో స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటివరకు ఫిర్యాదు అందలేదని శాంతినగర్ ఎస్సై నాగశేఖర్ రెడ్డి తెలిపారు.

చోరీ కేసులో నలుగురు అరెస్టు

పెబ్బేరు, మార్చి 19 : 44వ నెంబరు జాతీయ రహదారిపై ఇటీవల జరిగిన పైపుల చోరీ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై హరిప్రసాదరెడ్డి బుధవారం తెలిపారు. ఈ నెల 16న తోమాలపల్లె గ్రామం వద్ద మహారాష్ట్రకు చెందిన గోవింద్ బుధాజీ అనే కాంట్రాక్టర్‌కు చెందిన రూ.2లక్షల 52 వేల విలువ గల పీఎల్‌బీ డక్ట్ కాయిల్ పైపుల బెండలు చోరీకి గురయ్యాయన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరిపి పెబ్బేరుకు చెందిన మానపాడు సుంకన్న, నాగర్‌కర్నూలు జిల్లా లింగాలకు చెందిన మానపాటి శివ, గద్వాలకు చెందిన ఎరుకలి శివకుమార్, ఎరుకల పరశురాంలను అరెస్టుచేసి వారి నుంచి అశోక్ లీలాండ్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు.

భవన నిర్మాణానికి నిధులను పెంచాలి

అమరచింత, మార్చి 19 భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ నిధులను పెంచి సకాలంలో కార్మికులకు అందజేయాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని మార్క్స్‌భవనంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నయయన్నారు.

ఖోఖో క్రీడాకారిణికి సన్మానం

అమరచింత, మార్చి 19 : ఆలిండియా సివిల్ సర్వీసెస్‌లో రాష్ట్ర స్థాయి మహిళల ఖోఖో పోటీల్లో పాల్గొని తన ప్రతిభను చాటుకుని జాతీయస్థాయిలో ఖోఖో ఆట పోటీలకు ఎంపికైన క్రీడాకారిణి శిల్పను బుధవారం ఆత్మకూర్ వెటర్నరీ దవాఖానలో పని చేస్తున్న సహ ఉద్యోగులు పూలమాల శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ పశువైద్యులు రమేశ్ మాట్లాడుతూ.. జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సహ ఉద్యోగి శిల్ప జనవరి 23,24 తేదీలలో సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో జరిగిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ మహిళల విభాగంలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనగా ఈనెల 21 నుంచి 24 వరకు ఢిల్లీలో జరుగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయింది.

అరెస్టులతో ఉద్యమాన్ని అణచలేరు

- అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ఆశలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఆర్టీసీ బస్సుల్లో వెళ్తుండగా అరెస్టు
- సొంత పూచీకత్తుపై విడుదల

అయిజ, మార్చి 19 : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ఆశలకు రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం అందించేందుకు సర్కారు ఆమోదించాలని కోరుతూ చలో కలెక్టరేట్ ముట్టడికి వెళ్తున్న ఆశ కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బుధవారం ఉదయం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముట్టడికి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో వెళ్తున్న ఆశ కార్యకర్తలను బస్సులను తనిఖీలు చేసి కలెక్టరేట్‌కు వెళ్లకుండా ఆశ కార్యకర్తలను అడ్డుకుని, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, కల్పించాలని ఆందోళనలు చేపడుతున్నామన్నారు. గతంలో ఆందోళనలకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ పార్టీ పెద్దలు అధికారంలోకి వచ్చిన వెంటనే డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. పలు విడతలుగా డిమాండ్లను పరిష్కరించాలని పోరాటం చేస్తున్న కాంగ్రెస్ సర్కారు హామీలను అమలుచేయడంలో విఫలం కావడంతో తెలంగాణ ఆశ వర్కర్ల యూనియన్ (సీఐటీయూ) ఆదేశాల మేరకు చలో కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చిందన్నారు. అందులో భాగంగా కలెక్టరేట్ ముట్టడికి వెళ్తున్న తమను ప్రభుత్వం అకారణంగా పోలీసులతో అరెస్టు లు చేయించిందన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న తమను పోలీసులతో అరెస్టులు చేయిస్తున్నార ని మండిపడ్డారు. అరెస్టులతో ఉద్యమాలను అణచలేరని హెచ్చరించారు. డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం చే స్తామన్నారు.

అనంతరం ఎస్సై శ్రీనివాసరావు సొంత పూచికత్తుపై ఆశను విడుదల చేశారు. కార్యక్రమంలో సంతోషమ్మ, చిట్టెమ్మ, హేమలత, రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అయిజ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిరసన తెలుపుతున్న ఆశలు

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను డిమాండ్ చేస్తూ గద్వాల కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు.. ఆందోళనలో హాజరైన ఆశ కార్యకర్తలు ఎండలో తమ సమస్యల సాదనకు డిమాండ్ మధ్యాహ్న సమయం కావడంతో అక్కడే భోజనాలు చేశారు..

నెలాఖరులోగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్‌సురభి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, మార్చి 19 : ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికైన లబ్ధిదారులందరూ ఈ నెలాఖరు లోపు ఇళ్ల నిర్మాణం ప్రారంభం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్యతో కలిసి తాసీల్దార్లు, ఎంపీడీవోలు వెబ్‌ఎక్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎంపిక చేయబడిన 15గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపికైన మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణం ప్రారంభం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాసీల్దార్లు, ఎంపీడీవోల ద్వారా వచ్చిన ప్రోఫార్మాకు అనుగునంగా వారికి దగ్గర్లో ఉన్న రీచ్ నుంచి ఇసుక తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలాని సూచించారు. సమావేశంలో విరోబా, పర్వతాలు వెబ్ ఎక్స్ ద్వారా తాసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలి

2024-25 రబీ సీజన్‌కు సంబంధించి రైతుల నుంచి వరిధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రణాళికబద్ధంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. కలెక్టర్ తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ రెవిన్యూ వెంకటేశ్వర్లుతో కలిసి రబీసీజన్ వరి కొనుగోలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏప్రిల్ రెండోవారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నట్లు, అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారి గోవిందునాయక్, డీఆర్డీవో ఉమాదేవి, పౌర సరఫరాల శాఖ అధికారి కాశీవిశ్వనాథ్, డీఎం జగన్, జిల్లాసహకారశాఖ అధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.

ఇసుక రీచుల నివేదిక అందజేయాలి

జిల్లాలో స్థానిక అవసరాలకు ఇసుక వాడుకోవడానికి అందుబాటులో ఉన్న రీచులను వెరిఫై చేసి నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ రెవిన్యూ వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లాస్థాయి సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేవంలో మైనింగ్ అధికారి గోవిందరాజు, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్, సి సెక్షన్ సూపరిండెంట్ కిషన్, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

పరుగో..పరుగు..

- పత్తి విత్తనాలు ఫెయిల్ అయినట్లు దుమారం
- విత్తనాలు ఫెయిల్‌తో హైదరాబాద్‌కు పరుగులు పెట్టిన ఆర్గనైజర్లు అయినట్లు అరోపణలు
- విత్తనాలు పాస్ చేయించేలా లాబీయింగ్

గద్వాల అర్బన్, మార్చి 19 : పత్తి విత్తనాలు పండించడంలో నడిగడ్డ ప్రాంతానికి పెట్టింది పేరు. అలాగే పత్తి విత్తనాలను కూడా అదేస్థాయిలో అవకతవకలు, అక్రమ రవాణాకు తరలించేందుకు కూడా ఈ ప్రాంతంకు పేరు ఉన్న విషయం విధితమే. ఈ వ్యవహారాలు అంతట కూడా గతంలో జరిగాయి.. అదేస్థాయిలో అధికారులు కట్టుదిట్ట చర్యలు తీసుకునడంతో అదుపులోకి వచ్చాయి. అయితే ఈ సీజన్‌లో కూడా రైతులు సీడ్ పత్తి విత్తన సాగు పెద్దమొత్తంలో సాగుచేశారు. సాగు అనంతరం వేసిన పత్తిపంటను రైతుల నుంచి ఆర్గనైజర్‌లు సేకరించి విత్తనాలు అడించి పాస్, ఫెయిల్‌కు తెలుసుకునేందుకు విత్తనాలను హైదరాబాద్‌లోని ఆయా కంపెనీ నిర్వాహకులు కంపెనీలకు తరలించారు. ఈ క్రమంలో గత రెండు రోజులుగా సీడ్ పత్తి విత్తనాలు ఆయా కంపెనీలలో కొన్ని లాట్లు ఫెయిల్ అయినట్లు పెద్దమొత్తంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. విత్తనాలు పరిశీలన అనంతరం ఫెయిల్ అయిన విషయం తెలుసుకున్న కొంతమంది సీడ్ ఆర్గనైజర్‌లు హైదరాబాద్ కంపెనీ ప్రతినిధులను కలిసేందుకు హైదరాబాద్‌కు పరుగులు పెట్టిన్నట్లు తెలిసింది. కొంతమంది ఆర్గనైజర్‌లకు చెందిన పత్తివిత్తనాల విత్తన లాట్లు పెద్ద మొత్తంలో ఫెయిల్ అవ్వడం పట్ల కంపెనీ ప్రతినిధులు సర్వత్రా అనుమానాలు వ్యక్తం చేస్తునట్లు సమాచారం. సీడ్‌పత్తి విత్తనాలు రైతుల నుంచి సేకరించిన అనంతరం కొంతమంది సీడ్ ఆర్గనైజర్‌లు కమర్షియల్ పత్తివిత్తనాలు వాటిలో కలిపి సరఫర చేసినట్లు కంపెనీ ప్రతినిధులు అనుమానిస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారం అంతటా ఆర్గనైజర్‌ల జిమ్మికులతోనే నడుస్తోందనట్లు జిల్లాలో పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అయితే సీడ్ పత్తి పంట ఈ సంవత్సరం దాదాపు 40వేల ఎకరాలకు పైగా విత్తనసాగు అయినట్లు ఈ సమాచారం. అదేస్థాయిలో కమర్షియల్ పత్తి సాగు కూడా పెద్దమొత్తంలో ఉన్నట్లు సమాచారం. కమర్షియల్ పత్తి సీడ్ ఆర్గనైజర్‌లు తీసుకొ ని పత్తి నుంచి విత్తనాలు వేరు చేసి వాటిని సీడ్ విత్తనాలలో కలిపి కంపెనీలకు పంపినట్లు ఆరోపణలు ఉన్నాయి. కంపెనీ ప్రతినిధులు విత్తనాలను పరిశీలించి ఫెయిల్ అని తెలపడంతో ఆర్గనైజర్‌లకు టెన్షన్ మొదలైనట్లు సమాచారం. విత్తనాలు ఫెయిల్ అని రైతులకు తెలిస్తే తమకు సమస్య వస్తుందన్న విషయాన్ని గ్రహించి సీడ్ పత్తి విత్తనాల కంపెనీ ప్రతినిధుతో కొంతమంది సీడ్ ఆర్గనైజర్‌లు కలిసినట్లు తెలిసింది. తమకు సంబంధించిన విత్తనాలను ఎలగైనా పాస్ చేసేటట్లు చూడాలని లాబీయింగ్ చేస్తున్నట్లు జిల్లాలో జోరుగాచర్చ నడుస్తోంది.ఈ వ్యవహారం అంతటా పూర్తిగా బయటకు రావాలంటే మరో రెండు, మూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉంది.

న్యాయవాదుల అడహక్ కమిటీ నియామకం

వనపర్తి టౌన్, మార్చి 19 : వనపర్తి జిల్లా బార్ అసోసియేషన్ కౌన్సిల్‌లో బుధవారం న్యాయవాదుల అడహక్ కమటీని నియమించారు. వనపర్తి జిల